క్లుప్తంగా

వైభవంగా గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ అమ్మవారు

యల్లనూరు: కూచివారిపల్లిలో గంగమ్మ జాతరను మంగళవారం వైభవంగా జరిగింది. వేకువ జామున నుంచి గంగమ్మ అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మూగజీవాలను బలిదానం చేశారు. ఇంటింటికీ మూగజీవాలను బలిచ్చి అమ్మవారి మొక్కులు తీర్చుకున్నారు. సర్పంచ్ నారాయణ స్వామి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు వెంకటేష్ నాయుడు, జగదీష్, సుదర్శన్‌నాయుడు ఇళ్లకు చేరుకొని తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏర్పాటు చేసిన విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి



బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఉషారాణి

గార్లదిన్నె: మండలంలో 18 సంవత్సరాలు నిండిన యువతీ,యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్‌ఓలకు స్పెషల్ సమ్మరీ రివిజన్ ట్రైనింగ్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ 2024 జనవరి 1నాటికి 18 సంవత్సరాలు నిండిన వారికి ఓటు హక్కు కల్పించాలన్నారు. అలాగే చనిపోయిన ఓటర్లు, పెళ్లి అయిన వారు, ఇతర గ్రామాలకు వెళ్లిన వారిని ఇంటింటి సర్వేలో గుర్తించి ఫారం -7, ఫారం-8లో వివరాలు నమోదు చేసి అప్డేట్ చేయాలన్నారు. ఓటర్ ఆధార్ సీడింగ్ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

15న 'జగనన్న ఆణిముత్యాలు'

శింగనమల: శింగనమల నియోజకవర్గంలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమానికి ఎంపికైన విద్యార్థులను ఈనెల 15న ఎస్‌ఆర్‌ఐటీ కళాశాలలో సన్మానించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి నరసింహరాజు తెలిపారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరవుతారన్నారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించండి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

తాడిపత్రి అర్బన్: ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పీవీ. ప్రతాప్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. శనివారం ఆయన తన నివాసంలో పార్టీ సీనియర్ కార్యకర్తల అసెంబ్లీ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం ద్వారా రైతులకు ఏడాదికి రూ.6 వేలు అందిస్తున్నట్లు గుర్తు చేశారు. వచ్చే ఎన్నికల్లో కూడా కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని, అందుకు ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ రెడ్డి, పట్టణాధ్యక్షుడు ఆంజనేయులు, మహిళా అధ్యక్షురాలు పద్మ, ఓబీసీ విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజి తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే సంస్థ మనుగడ

- ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆదోని



కండక్టర్‌కు అవార్డు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్

అనంతపురం సిటీ: ఉద్యోగులు, సిబ్బంది అందరూ సమష్టిగా కృషి చేసి, ఆదాయాన్ని పెంచుకోగలిగినప్పుడే సంస్థ మనుగడ సాధ్యమవుతుందని ఆర్టీసీ ఆర్‌ఎం సుమంత్ ఆదోని అన్నారు. మంగళవారం అనంతపురం డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన ఉద్యోగుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. మే నెలలో లక్ష్యానికి మించి ఆదాయం తెచ్చిన కండక్టర్లు వెంకటేశులు, ఇన్నయ్య, సత్యమయ్య, పుల్లయ్య, రంగనాథరెడ్డి, డీజిల్ పొదుపు పాటించిన డ్రైవర్లు శ్రీనివాసులు, కుమార్, వీరన్న, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఏడీసీ రాజారావు, ఎలక్ట్రీషియన్ శ్రీధర్‌కు నగదు బహుమతులు అందించారు. డిపో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్, అసోసియేషన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం జగన్ పెద్దపీట



తురకపల్లిలో చిన్నారికి విద్యాకానుక అందిస్తున్న ఎంపీపీ విశాలాక్షి



యాడికి ఉన్నత పాఠశాలలో కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



బీకేఎస్: విద్యార్థికి కిట్ అందిస్తున్న ఎంపీపీ సునీత, సర్పంచ్ పార్వతి

గుత్తి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారని ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి పేర్కొన్నారు. మంగళవారం తురకపల్లిలో ఎంపీపీ విశాలాక్షి, ఎంఈఓ రవినాయక్, అబ్బేదొడ్డిలో సర్పంచ్ లావణ్య, వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీకాంతరెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఉజ్వల భవిష్యత్తు కోసమే జగనన్న దేశంలో ఎక్కడా లేని విధంగా విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. సర్పంచ్ సుందరమ్మ, ఎంపీటీసీ సుమలత, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, హనుమంతురెడ్డి, రంగస్వామిరెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

యాడికి: జగనన్న విద్యాకానుక పేద విద్యార్థులకు వరమని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్‌నాయుడు, ఎంఈఓ కాశెప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జగనన్న విద్యాకానుక పంపిణీ జరిగింది. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. హెచ్‌ఎం విజయమ్మ, ఉపాధ్యాయులు, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని అనంతపురం రోడ్డు జంగాల కాలనీ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. మున్సిపల్ కౌన్సిలర్ మహబూబ్ జాన్, హెచ్‌ఎం ఆదినారాయణ, ఉపాధ్యాయుడు సూర్య ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జ్ దస్తగిరి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా తాడిపత్రి రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. పిల్లల చదువులో తల్లిదండ్రులు భాగస్వాములు కావాలని ఎంఈఓ రవినాయక్ సూచించారు.

పామిడి: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు బంగారుబాటలు వేస్తోందని సర్పంచ్ బెల్లాల ప్రమీలమ్మ, స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ మిడుతూరు జాన్‌సుధీర్, గుత్తి సీఎస్‌ఐ డివిజన్ చైర్మెన్ ఆర్ డేవిడ్‌నాయక్ అన్నారు. మంగళవారం స్థానిక సీఎస్‌ఐ ఎయిడెడ్ స్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ చేశారు. స్కూల్ హెచ్‌ఎం సంజీవకుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి పెద్దపీట వేస్తోందని ఎంపీపీ సునీత పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సునీత మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్య మంత్రి చేయలేనటువంటి విద్యాభివృద్ధి కార్యక్రమాలను సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. సర్పంచ్ పార్వతి, హెచ్‌ఎం వసుంధర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బుక్కరాయసముద్రం: మండలంలో ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి బుధవారం పర్యటించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంకే నరేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు రోటరీపురంలో సీతారామాలయం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రకృతిలో సంగీతం మిళితం

గుంతకల్లుటౌన్: విశ్వమంతా వ్యాపించిన సంగీతం ప్రకృతిలో మిళితమైందని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున అన్నారు. ఏపీ ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 30 రోజులుగా నిర్వహించిన ఉచిత సంగీత శిక్షణ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక బి.టి.పక్కీరప్ప భవనంలో జరిగిన సమావేశంలో ఆయన భారతీయ సంగీతం గొప్పతనాన్ని వివరించారు. చిన్నారులను ప్రోత్సహించేందుకు ప్రజానాట్యమండలి సంగీత తరగతులను ఉచితంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. రిటైర్డ్ తహసిల్దార్లు ఇఓ.రాముడు, జీవీ.చలపతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుళ్లాయప్ప, జీవీ.ప్రసాద్, పట్టణ కార్యదర్శి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్టు

గుత్తి రూరల్: ఇసురాళ్లపల్లిలో అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వీర్రాజు అనే వ్యక్తిని మంగళవారం సెబ్ పోలీసులు అరెస్టు చేశారు. వీర్రాజు ఇంట్లో 20 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు సెబ్ ఎస్‌ఐ అలీ అహ్మద్ తెలిపారు.

రీ సర్వే పనులు వేగవంతం చేయండి



రీ సర్వే కిట్లను అందిస్తున్న తహసీల్దార్ అలెగ్జాండర్

యాడికి: ప్రభుత్వం మంజూరు చేసిన కిట్లతో రీ సర్వే పనులు వేగవంతం చేయాలని తహసీల్దార్ అలెగ్జాండర్ సిబ్బందికి సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని గ్రామ సర్వేయర్లకు ప్రభుత్వం మంజూరు చేసిన సర్వే కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 5 రెవెన్యూ గ్రామాల్లో మంగళవారం వరకు 4,331 ఎకరాల్లో రీ సర్వే పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రాజ్ కుమార్, మండల సర్వేయర్ సుంకన్న, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: ప్రభుత్వం భూ సర్వేతో రైతులకు శాశ్వత భూ హక్కు కల్పిస్తోందని తహసీల్దార్ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం ఓబులాపురంలో రెవెన్యూ అధికారులు భూసర్వేపై గ్రామ సభ నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఉషారాణి మాట్లాడుతూ బుధవారం నుంచి గ్రామంలో భూ సర్వే చేస్తామన్నారు. భూ సర్వేకు ముందు సంబంధిత రైతులకు నోటీసులు అందజేస్తామన్నారు. రీ సర్వేతో ప్రతి రైతుకు ఎల్‌పీఎం ఆధారిత మాప్ చేసి పట్టాదారు పుస్తకాలు మంజూరు చేస్తామన్నారు. రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై సత్వరం స్పందించండి



రాజేంద్రనగర్‌లో నీటి పరీక్ష నిర్వహిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు, కలుషిత నీరు, పైప్‌లైన్ లీకేజీలపై సత్వరమే స్పందించి సమస్య పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ వి.మల్లికార్జున వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని 14వ వార్డులో పర్యటించిన కమిషనర్ ప్రజల సమక్షంలోనే నీటి పరీక్షలు నిర్వహించారు. సురక్షితమైన శుద్ధిచేసిన నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కసాపురం రోడ్ అయ్యప్ప స్వామి గుడి వద్దనున్న స్విమ్మింగ్ పూల్ నిర్వాహకుడు మురుగునీటిని వదిలేయడం వల్ల ఆ నీరు తమ ఇళ్ల ముంగిట నిలుస్తోందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో కమిషనర్ స్విమ్మింగ్‌పూల్‌ను, దాని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. స్విమ్మింగ్ పూల్ నుంచి మురికినీటిని వదలరాదని దాని నిర్వాహకుడికి సూచించారు. మున్సిపల్ ఇంజనీర్ ఈశ్వరయ్య, డీఈ హేమచంద్ర, ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రోజూ 'స్పందన' నిర్వహించాలి



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

నార్పల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని రోజూ సచివాలయాల్లో నిర్వహించాలని అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఈ నెల 19 వరకు ఎంపీడీఓ బాధ్యతలో కొనసాగనున్నారు. అనంతరం ఆయన స్థానిక సచివాలయం-4ను ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు వారి అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సచివాలయ ఉద్యోగులంతా సక్రమంగా విధులు నిర్వర్తించాలన్నారు. రోజూ 3 గంటల నుంచి 4 గంటల వరకు తప్పకుండా స్పందన కార్యక్రమం నిర్వహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులతో కాసేపు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, ఈఓఆర్డీ లక్ష్మినరసింహ, ఏఓ ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శులు అశ్వర్థనాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ కుటుంబ రుణం తీర్చుకుంటాం

అనంతపురం సిటీ: ముస్లిం మైనారిటీల అభ్యున్నతికి వైఎస్ కుటుంబం చేసిన సాయం మర్చిపోలేమని, రాబోవు ఎన్నికల్లో ఆ కుటుంబ రుణం తీర్చుకుంటామని ముస్లిం మైనార్టీ ప్రజాప్రతినిధులు ప్రకటించారు. 'హర్ దిల్ మే వైఎస్సార్ - హమ్ సబ్ జగన్‌కే సాత్' కార్యక్రమంలో భాగంగా వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లా బేగ్ ఆధ్వర్యంలో అనంతపురం రెండో రోడ్డులోని బావుద్దీన్ మస్జిద్, గుల్జార్‌పేటలోని మస్జిద్-ఏ-అయేషా (మర్కజ్) మస్జిద్‌లో నిర్వహించిన కార్యక్రమానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జనాబ్ ఖాదర్‌బాషా, అనంతపురం నగర మేయర్ మహమ్మద్ వసీం సలీం, ఉర్దూ అకాడమీ రాష్ట్ర చైర్మన్ హిరియల్ నదీం అహమ్మద్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఫయాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

మరో 30 ఏళ్లు జగనే సీఎంగా ఉండాలి..

ముస్లింమైనార్టీ ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ వైఎస్సార్ నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేసి ముస్లింల హృదయాల్లో చిరస్థాయిగా నిలచిపోయారన్నారు. ఆయన బాటలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించి, ఉన్నత పదవుల్లో నియమించడం గర్వకారణమన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషి ముస్లింలపై ఆయనుకున్న అభిమానానికి నిదర్శనమన్నారు. మరో 30 ఏళ్ల పాటు వైఎస్ జగనే సీఎంగా ఉండాలని వారు కోరుకున్నారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు జాయింట్ సెక్రటరీ ఖాజా, కార్పొరేటర్లు ఇషాక్, రహంతుల్లా, కో-ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, నాయకులు గఫార్, ఇమ్రాన్, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

కళ్యాణదుర్గం: మండలంలోని శీబావి గ్రామానికి చెందిన బోయ వన్నూరుస్వామి విద్యుత్‌షాక్‌కు గురయ్యాడు. ఈ సంఘటన మంగళవారం సాయంత్రం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... కరెంటు స్తంభం నుంచి ఇంట్లోకి ఉన్న సర్వీసు వైరు షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు వస్తుండటంతో ఫీజు తొలగించాడు. విద్యుత్ సరఫరా ఆగిపోయిందని వైరును తాకగా కరెంట్ షాక్‌కు గురయ్యాడు.

ముగిసిన సీఏఎస్ ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలను పర్యవేక్షిస్తున్న జేఎన్‌టీయూఏ వీసీ జింకా రంగజనార్దన

అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీం (సీఏఎస్) ఇంటర్వ్యూలు మంగళవారం ముగిశాయి. జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ జింకా రంగజనార్దన అధ్యక్షతన రాష్ట్ర గవర్నర్ నామినీ, వివిధ బోర్డ్‌ఆఫ్‌స్టడీస్ చైర్మన్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కెమికల్ విభాగంలో అసోసియేట్ నుంచి ప్రొఫెసర్, మేథమేటిక్స్ విభాగంలో అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్, ఇంగ్లిష్ విభాగం నుంచి అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్, ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ నుంచి అసోసియేట్ ప్రొఫెసర్‌గా పదోన్నతి కల్పించనున్నారు. ఇంటర్వ్యూ బోర్డులో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్, డీపీపీ ప్రొఫెసర్ వి.సుమలత సభ్యులుగా ఉన్నారు.

గడప గడపలో సంక్షేమ వెలుగులు

- ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి



సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

యల్లనూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనలో గడప గడపలో సంక్షేమ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు ప్రభుత్వ విద్య సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి హాజరయ్యారు. తేరు సమీపంలో మహిళలు పెద్దసంఖ్యలో ఎమ్మెల్యేకు పూలమాలలు, హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రతి ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ఆయా కుటుంబాలకు అందిన లబ్ధిని వివరించారు. స్థానికులు పలు సమస్యలు ఆమెకు దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మేనిఫెస్టోలోని అంశాలను 99 శాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. అర్హులకు ఎవరి సిఫారసు లేకుండా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. జగనన్న విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పాఠశాల ప్రారంభం రోజే జగనన్న విద్యా కానుక ద్వారా పాఠ్య, నోటు పుస్తకాలు, టై, షూ, బెల్టు, బ్యాగ్ అందించిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జెడ్పీటీసీ ప్రతాప్ రెడ్డి, తహసీల్దారు సుమతి, ఎంపీడీఓ వీరరాజు, వైద్యాధికారి లోకేష్‌కుమార్, సర్పంచ్ ఏ రామాంజులరెడ్డి, నాయకులు పురుషోత్తంనాయుడు, నాగరంగయ్య, చాంద్‌బాషా, జాఫర్, రంగనాథ్, హనుమంతు, చిన్న ఓబులేసు, ఆంజనేయులు, జీపు శేఖర్, నిట్టూరు శ్రీనివాసరెడ్డి, వేములపల్లి ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరందించాలి

గుంతకల్లుటౌన్: హెచ్చెల్సీ ఆయకట్టుకు తుంగభద్ర జలాలను అందించి రైతన్నలను ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఐ నాయకులు జి.కొట్టాల వద్దనున్న జీబీసీ, ఏబీసీ, జీఎస్‌బీలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ హెచ్చెల్సీకి అధికారికంగా రావాల్సిన 32.5 టీఎంసీలకు గానూ కనీసం 10 టీఎంసీల నీరు రావడం లేదన్నారు. కర్ణాటక ప్రభుత్వం అక్రమంగా నిర్మిస్తున్న అప్పర్ భద్ర, నవళి ప్రాజెక్టులను నిలిపివేయాలన్నారు. రైతు సమస్యల పరిష్కారానికై ఈ నెల 21న కలెక్టరేట్ ముందు నిర్వహించనున్న రైతు గర్జన సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గోవిందు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మహేష్, మండల, పట్టణ కార్యదర్శులు రాము, గోపీనాథ్, నాయకులు రామాంజినేయులు,గౌస్, ఈశ్వరయ్య, సురేష్, మురళీ, ఉమ్మర్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోండి

గుంతకల్లుటౌన్: నిబంధనలకు విరుద్ధంగా కళాశాలల్లో అధిక ధరకు పాఠ్య, నోట్ పుస్తకాలు విక్రయిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక నారాయణ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పుస్తకాలను విక్రయించడాన్ని ఏబీవీపీ నాయకులు అడ్డుకున్నారు. కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. విద్యార్థుల నుంచి పుస్తకాలు, వివిధ రకాల ఫీజుల పేరుతో దోపిడీకి పాల్పడుతున్న నారాయణ కళాశాలపై ఆర్‌ఐఓకు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలియజేశారు. ఏబీవీపీ పట్టణ కార్యదర్శి శివరాజ్, ఉపాధ్యక్షులు వంశీ, అక్షయ్, సహాయ కార్యదర్శి నాగేంద్ర, నాయకులు అనిల్,రాజేష్, మారుతి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలు సాగు చేయండి



సదస్సులో రైతులకు సూచనలిస్తున్న డీఆర్సీ డీడీఏ మద్దిలేటి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఓ ముస్తాక్ అహ్మద్

తాడిపత్రి అర్బన్: చిరుధాన్యాల సాగు రైతులకు లాభదాయకమని డిఆర్సీ డీడీఏ మద్దిలేటి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో చిరుధాన్యాల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగులు, జొన్నలు, ఊదలు, కొర్రలు, సామలు, అండు కొర్రలు, ఆరికలు సాగు చేయడం ద్వారా రైతుకు ఆదాయంతో పాటు ఆరోగ్యం, వాతావరణ కాలుష్యం తగ్గి నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. చిరు ధాన్యాలతో వివిధ రకాల జబ్బుల నుంచి ఉపశమనం పొందొచ్చన్నారు. వరిని తగ్గించాలని, యూరియా వాడకాన్ని తగ్గించి నానో యూరియా పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఏడీఏ చెంగల్రాయుడు, అభ్యుదయ రైతులు, ఆర్బీకె అసిస్టెంట్లు, ఏఈఓలు, ఏఓలు పాల్గొన్నారు.

గుత్తి రూరల్: రైతులు చిరుధాన్యాల పంటల సాగుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తహసీల్దార్ మహబూబ్ బాషా, ఏఓ ముస్తాక్ అహ్మద్ సూచించారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో చిరుధాన్యాల సాగుపై ప్రజాప్రతినిధులు, రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ కొర్ర, రాగి, జొన్న పంటలు సాగు చేసిన రైతుల ఉత్పత్తులను ప్రభుత్వమే మద్దతు ధరతో కొనుగోలు చేస్తుందన్నారు. తహసీల్దార్ మహబూబ్ బాషా మాట్లాడుతూ చిరు ధాన్యాలకు ప్రస్తుతం మంచి ఆదరణ ఉందని రైతులు వాటిని సాగు చేసి మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కౌన్సిలర్ ఫరూక్, రైతులు బేడల వెంకట్రాముడు, ఎస్‌సీ.రంగయ్య, ఇబ్రహీం, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పామిడి: చిరుధాన్య పంటల సాగుతో లాభాల పంట పండించుకోవాలని ఏఓ డీ లీనా వసుంధర రైతులకు సూచించారు. మంగళవారం ఎద్దులపల్లిలో నిర్వహించినఅంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవానికి హాజరై మాట్లాడారు. పంట మార్పిడితో కూడిన చిరుధాన్యాల సాగుతో భూసారం పెంపొందుతుందన్నారు. సర్పంచ్ జీ వెంకటరమణమ్మ, ఎంపీటీసీ సుధాకర్‌శర్మ, ఏఈఓ శ్రీనివాసరావు, వీఎస్‌ఏ ఆదినారాయణ, ఎంపీఈఓ రామాంజనేయులు, రైతులు పాల్గొన్నారు.

అహుడా ఏపీఓగా ఇస్సాక్ అహ్మద్



అహుడా ఏపీఓగా బాధ్యతలు తీసుకున్న ఇస్సాక్ అహ్మద్‌ను సన్మానిస్తున్న లైసెన్స్‌డ్ ఇంజినీర్లు

అనంతపురం క్రైం: అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (అహుడా) అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఇస్సాక్ అహ్మద్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల గుంతకల్లు ఏసీపీగా ఉన్న ఈయన అహుడా ఏపీఓగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా అహుడా కార్యాలయంలో ఆయన్ను లైసెన్స్‌డ్ ఇంజినీర్లు పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో లైసెన్స్ ఇంజినీర్లు బోయ తిరుపాల్, కృష్ణ, రవి, మురళీ, జహీర్, తదితరులు పాల్గొన్నారు.

ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలి

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటు చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్పకు రాయలసీమ విమోచన సమితి నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సమితి జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, నాయకులు జ్ఞానేశ్వర్‌రెడ్డి, రాజేష్, కోటేశ్వరరావు మాట్లాడుతూ నాడు-నేడు కార్యక్రమం క్రింద ప్రభుత్వం ఆసుపత్రిలో అన్ని సదుపాయాలు కల్పించిందన్నారు. ట్రామా సెంటర్‌ను ఏర్పాటు చేస్తే ఇంకా బాగుంటుందన్నారు. 50 పడకల ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జి.ఎర్రగుడికి చెందిన శివ అనే వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన శివ కొన్ని రోజులుగా కుటుంబసమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో ఇంట్లో నుంచి పొలం వద్దకు వెళ్లి విష ద్రావకం తాగాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న శివను గమనించిన పక్క పొలాల్లోని రైతులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అతడిని చికిత్స గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.